క్లుప్తంగా

నవోదయ విద్యార్థినికి గోల్డ్ మెడల్


గోల్డ్ మెడల్ అందుకున్న దీపిక స్రవంతి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురం జవహర్ నవోదయ విద్యాలయంలో చదువు పూర్తి చేసి ప్రస్తుతం తెలంగాణాలోని నల్గొండలో కామినేని వైద్య కళాశాలలో డెంటర్ చివరి సంవత్సరం ఫలితాల్లో ఓ విద్యార్థిని గోల్డ్‌మెడల్ అందుకున్నారు. మర్రిపాడు మండలం కంపసముద్రం గ్రామానికి చెందిన మున్నెల్లి దీపిక స్రవంతి ఈ ఘనత సాధించారు. ఈమె తండ్రి శివశంకరయ్య మర్రిపాడు మండలం చుంచులూరు ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తుండగా, తల్లి శ్రీదేవి బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. దీపిక తమ్ముడు వివేక్ కూడా నవోదయ విద్యాలయంలో చదివి ప్రస్తుతం చెన్నైలో ఇంజినీరింగ్ విద్యాభ్యాసం చేస్తున్నారు. దీపిక మరెన్నో విజయాలు సాధించాలని విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

14న మండల సర్వసభ్య సమావేశం

జలదంకి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 14న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాల విక్రయం

ఆత్మకూరురూరల్: ప్రతి భారతీయుడికి గర్వకారణమైన త్రివర్ణ పతాకం 76వ స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని అన్ని తపాలా కార్యాలయాల్లో విక్రయాలు చేపట్టామని ఆత్మకూరు సబ్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగ' పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రజలు అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై మన జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాతృభూమిపై మనకున్న మమకారాన్ని తెలియజేయాలన్నారు. ఒక్కో జాతీయ పతాకం రూ.25 తెలిపారు. లేదా 99599 56383 నంబరులో సంప్రదించాలని కోరారు.

రెవెన్యూ సదస్సు నేడు

ఆత్మకూరు: పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో గురువారం రెవెన్యూ సదస్సుతో పాటు వలంటీర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాద్‌రావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి రెవెన్యూ అధికారులతో సమావేశం, సమీక్ష మంత్రి, ఎమ్మెల్యే నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

డీఈఓకు ఘన సన్మానం


డీఈఓ గంగాభవానీని సత్కరిస్తున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరును విద్యాశాఖ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు అధికారులు, ఉపాధ్యాయులు బుధవారం డీఈఓ గంగాభవానీని శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, ఎంఈఓ నజీర్ బాషా, ప్రధానోపాధ్యాయుడు సోమవరపు భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పారావుపాళెంలో ప్రబలిన జ్వరాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావు పాళెం పంచాయతీలో కాలనీల్లో పది మందికి పైగా జ్వరాల వల్ల బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. తాగునీటి పైపులైన్లు పగిలిపోయి కలుషిత నీరు సరఫరా కావడంతో పలువురికి ఆరోగ్య సమస్యలు తలెత్తినట్లు చెబుతున్నారు. జ్వరాల బారిన పడిన వారిలో కొందరికి డెంగీ పాజిటివ్‌గా తేలడంతో ఆత్మకూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 8 మంది జ్వరాల బారిన పడినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై ఏఎస్ఎం శ్రీదేవిని సంప్రదించగా జ్వరాల నియంత్రణకు వైద్య సేవలు అందిస్తున్నామని వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లి వైద్య శిబిరం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ట్రాఫికర్

కావలి పట్టణ నడిబొడ్డుగా వెళ్తున్న రోడ్డు ఒకప్పుడు చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారి. వాహనాల రద్దీతో సతమతమవుతున్న సమయంలో ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని పట్టణ శివారు ప్రాంతాల మీదుగా హైవే ఏర్పాటు చేశారు. ఇప్పుడు లోకల్‌గా గ్రాండ్ ట్రంక్‌రోడ్డు అయింది. ట్రాఫిక్ తగ్గిందనుకునే సరికి రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక దుకాణాలు, ఆక్రమణలు పెరిగాయి. మళ్లీ ఇరుకుగా మారింది. ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడానికి కూడా అవకాశం లేని పరిస్థితి. విధిలేక ఎక్కడైనా ఖాళీ ఉందని పార్కింగ్ చేసి పది నిమిషాల్లో పని చూసుకుని వచ్చేసరికి పోలీసుల చలానాలు విధిస్తున్న దయనీయస్థితి.

- ఇరుకుగా మారిన ట్రంక్‌రోడ్డు
- పార్కింగ్‌కు అవస్థలు
- నో పార్కింగ్ అంటూ పోలీసుల చలానాలు

రైతు బజార్ ముందు రోడ్డులోకి చొచ్చుకొచ్చిన దుకాణాలు, వాహనాల పార్కింగ్



కావలి: పట్టణంలోని గ్రాండ్ ట్రంక్‌రోడ్డు అటు ఆక్రమణలు, ఇటు తాత్కాలిక దుకాణాలు ముందుకు చొచ్చుకొస్తున్న నేపథ్యంలో రోజు రోజుకు కుచించుకుపోతోంది. ఈ పరిస్థితి ఇటు మున్సిపాలిటీకి కానీ, అటు పోలీసులకు పట్టడం లేదు. ఈ పరిణామం పోలీసులకు చలానాలు రాయడానికి భలేగా కలిసివస్తోంది. తోపుడు బళ్ల వ్యాపారాలుతో ఇరుకుగా మారిన రోడ్డు లో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో పాదచారులకు దినదిన ప్రాణగండంగా మారింది.

కావలి పట్టణంలో నడిబొడ్డున ఉన్న ట్రంక్‌రోడ్డు ట్రాఫిక్‌లో జఠిలంగా తయారైంది. చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిగా ఉన్న ఈ రోడ్డుకు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ట్రాఫిక్ పెరగడంతో జాతీయ రహదారిను కావలి పట్టణ పొలిమేరలు మీదగా మళ్లించి నూతనంగా బైపాస్ రోడ్డును నిర్మించడంతో పట్టణ పరిధిలోని రోడ్డు ఆర్‌అండ్‌బీ శాఖకు బదిలీ అయింది. గ్రాండ్ ట్రంక్ రోడ్డుగా ఉన్న రోజుల్లోనే చెన్నై–కోల్‌కత్తా జాతీయ రహదారిలో భాగమైన పట్టణంలోని ట్రంక్‌రోడ్డులో భారీ వాహనాలు రయ్ రయ్ మంటూ రాకపోకలు సాగిస్తుండేవి. ఇరుకుగా ఉండే ఈ రోడ్డులో నిత్యం రోడ్డు ప్రమాదాలు, మరణాలు కోకొల్లుగా జరుగుతుండేవి. అప్పట్లో కావలికి బైపాస్ రోడ్డు నిర్మించి, పట్టణంలోకి భారీ వాహనాలు రాకుండా నివారించాలని డిమాండ్ ప్రజల్లో నుంచి వచ్చింది. ఇంతలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కావలికి బైపాస్ రోడ్డును పట్టణ దక్షిణ శివార్లలోని ముసునూరు నుంచి ఉత్తర శివార్లలోని మద్దూరుపాడు వరకు నిర్మించింది. భారీ వాహనాలు బెడద తీరిందని భావిస్తున్న తరుణంలో కావలి పట్టణంలో వాహనాలు సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయింది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల సరిహద్దులో ఉన్న ప్రధానమైన పట్టణం కావడంతో సమీప గ్రామాల ప్రజలు నిత్యం తమ అవసరాల కోసం కావలికి రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది.

వైఎస్సార్ హయాంలో విస్తరణ

అప్పట్లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.9 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పట్టణంలో ట్రంక్‌రోడ్డును కొంత విస్తరించారు. దీంతో పరిస్థితి కాస్త మెరుగైంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత విజయవాడ, గుంటూరు నగరాలు రాజధాని ప్రాంతం కావడంతో కావలి పట్టణం మళ్లీ వాహనాలతో రద్దీ ఏర్పడింది. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు చెందిన అధికారులు, ప్రముఖులు రాజధాని నగరాలకు రాకపోకలు సాగించడానికి కావలి పట్టణం మీదుగా ప్రయాణం చేయడం ప్రారంభించారు. కావలి చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు, కావలి ప్రజలు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో కావలి పట్టణంలోని ట్రంక్‌రోడ్డు నిత్యం రద్దీగా ఉంటూ ట్రాఫిక్ జామ్‌లు, ప్రమాదాలు చోటు చేసుకోవడం నిత్యకృత్యమైపోయాయి. ట్రంక్‌రోడ్డుకు ఇరుపక్కలా అన్ని రకాల వ్యాపారాలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో ట్రంక్‌రోడ్డు జనసందోహంతో పాటు, వాహనాలతో కిటకిటలాడుతోంది.

మున్సిపాలిటీ, పోలీసులదే బాధ్యత



పట్టణంలో వాహనాలు సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయాయి. ట్రంక్‌రోడ్డులో పార్కింగ్ వసతులు ఎక్కడా లేవు. షాపులు ముందు వాహనాలను పార్కింగ్ చేస్తుంటే షాపు యజమానులు రాద్ధాంతం చేస్తున్నారు. కూరగాయల కోసం రైతుబజారు వచ్చే వారు వాహనాలు పార్కింగ్ చేసుకోవడానికి వసతి లేకపోవడంతో రోడ్లపై అడ్డంగా పెట్టేస్తున్నారు. ట్రంక్‌రోడ్డులో వాహనాలు పార్కింగ్ కోసం మున్సిపాలిటీ, పోలీసులు సమన్వయంతో నిర్దిష్టమైన ప్రదేశాలను గుర్తించాలి.
– కూనం తాతిరెడ్డి, రోడ్డు ప్రయాణికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు

ఇరుకు రోడ్డు వల్లనే ట్రాఫిక్ సమస్య



పట్టణంలో ప్రధానమైన రోడ్డు ట్రంక్‌రోడ్డు ఒక్కటే. వాహనాలు, ఆటోలు, కార్లు, బస్సులు, లారీలు, పశువులు ఇలా అన్నీ కూడా ఈ ట్రంక్‌రోడ్డు పైనే ఉంటాయి. అసలే ఇరుకుగా ఉండే ట్రంక్‌రోడ్డు కావడం, పార్కింగ్‌కు ఎక్కడా స్థలం లేకపోవడం వల్లనే ఈ సమస్య. మున్సిపాలిటీతో సమన్వయం చేసుకుని పార్కింగ్ ప్రదేశాలను గుర్తించడం, షాపుల యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం.
– కె.శ్రీనివాసరావు, సీఐ, ఒకటో పట్టణం, కావలి



- ఈ ఫొటో కావలిలోని ట్రంక్‌రోడ్డులో ఉన్న రైతుబజారు. చిరు వ్యాపారులు రోడ్డుపై బతుకుదెరువు కోసం కాయలు అమ్మకాలు చేస్తుంటారు. దీంతో రైతుబజారుకు స్థానికులు తమ బైక్‌లను రోడ్డు మీదనే పార్కింగ్ చేసి వెళ్లిపోతుంటారు. దీనివల్ల ట్రంక్‌రోడ్డులో అంతా కూడా కుదించుకుపోతోంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి



- ఈ ఫొటో రైతుబజారు పక్కన ఉన్న వన్ టౌన్ పోలీస్‌స్టేషన్. కూరగాయలు కొనుగోలు కోసం వచ్చిన స్థానికులు తమ బైక్‌లను పోలీస్ స్టేషన్ ముందు పార్కింగ్ చేసిందుకు కానిస్టేబుల్ ఫైన్‌లు చలానా రాయడానికి ఫొటోలు తీస్తున్నారు. పోలీసుస్టేషన్ ముందు బైక్‌లు పార్కింగ్ చేస్తే తమ వాహనం సేఫ్‌గా ఉంటుందని భావిస్తే, పోలీసులు విచ్చలవిడి గా ఫైన్‌లు వేస్తుండడంతో స్థానికులు లబోదిబోమంటున్నారు.



- ఈ ఫొటోలో ఉన్నది ట్రంక్‌రోడ్డులో ఒక ప్రైవేట్ షాపు. కావలిలో పని చేసిన ఒక పోలీసు అధికారి ఈ షాపునకు రాకపోకలు సాగిస్తుండేవారు. దీంతో షాపు ముందు వాహనాలు నిలపరాదంటూ పోలీసు వారి హెచ్చరిక అనే బోర్డును దర్జాగా పెట్టేశారు. ఆ షాపు ముందు బైక్‌లు పార్కింగ్ చేయాలంటే ఇప్పటికీ హడలిపోతుంటారు.

ఆయిల్ పామ్ సాగుకు దరఖాస్తు చేసుకోవచ్చు


ఆయిల్‌పామ్ పంటను పరిశీలిస్తున్న ఉద్యానవన అధికారిణి సుధామయి

కావలి: ఉద్యాన పంట ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇస్తుందని, ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని కావలి ఉద్యానశాఖ అధికారిణి ఎం.సుధామయి చెప్పారు. దగదర్తి మండలంలో సాగులో ఉన్న ఆయిల్‌పామ్ పంటను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న ప్రధాన పంటలకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 750 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతోందన్నారు. అనేక మంది సాగుకు మొగ్గు చూపుతున్నారని చెప్పారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలకు రూ.20 వేలు, మొక్కల పెంపకానికి రూ. 21 వేల, సాగు చేతికి వచ్చే వరకు అంతర పంటల సాగుకు మరో రూ.21 వేల వంతున ప్రభుత్వం ప్రోత్సాహంగా ఇస్తుందని వివరించారు. ప్రస్తుతం దగదర్తి మండలంలో 55 ఎకరాల్లో సాగు జరుగుతుందని, ప్రభుత్వం మొక్కల కు పూర్తి సబ్సిడీ ఇస్తున్నందున, ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి ఉన్న కావలి, దగదర్తి, అల్లూరు, బోగోలు మండలాలకు చెందిన రైతులు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో కావలి ఉద్యాన శాఖకు దరఖాస్తు చేసుకోవచ్చుని వివరించారు.

విశ్వబ్రాహ్మణ సమితి నూతన కమిటీ ఎన్నిక


జిల్లా నేతలతో ఎన్నికైన మండల నూతన కమిటీ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయ ఆవరణలో బుధవారం మండల విశ్వబ్రాహ్మణ సమితి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడు బి.వెంకటశేషయ్య ఆచారి కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులకు ప్రత్యేకంగా హ్యాండ్‌క్రాఫ్ట్ ఐడెంటిటీ కార్డులు మంజూరు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అప్లికేషన్లకు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ ఫారాలు పూర్తి చేసి జిల్లా కమిటీకి అందజేస్తే ఐడెంటిటీ కార్డులు మంజూరు చేస్తామని చెప్పారు. మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా ఏ శ్రీనివాసాచారి, గౌరవ అధ్యక్షుడిగా ఎస్.సుభాకరాచారి, ప్రధాన కార్యదర్శిగా జి.రమేష్ ఆచారి, కోశాధికారిగా ఎస్.వీరాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ జిల్లా నేతలు రఘునాథ్ ఆచారి, రాఘవయ్య ఆచారి, ప్రసాద్ ఆచారి, భాస్కర్ ఆచారి పాల్గొన్నారు. వింజమూరు మండల మహిళా అధ్యక్షురాలిగా మునగంటి రాజేశ్వరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మణిపూర్ ఘటనలకు నిరసనగా ర్యాలీ


నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ సమాఖ్య క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ

ఉదయగిరి: మణిపూర్‌లో జరుగుతున్న విధ్వంసకాండ ఘటనలను నిరసిస్తూ బుధవారం ఉదయగిరిలో సమాఖ్య క్రైస్తవ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో భారీ సంఘీభావ శాంతి ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీ స్టేట్‌పేటలోని ఏబీఎం చర్చి కాంపౌండ్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. సమాఖ్య నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో మూడు నెలలుగా జరుగుతున్న క్రూరమైన ఘటనలు యావత్ భారత ప్రజలను కలిచి వేస్తున్నాయన్నారు. గిరిజన, క్రైసవ తెగలు జీవించే హక్కును అమానుషంగా హరించి వేయడం ద్వారా ప్రజాస్వామ్యానికే విఘాతం కలిగిస్తోందన్నారు. పాలకులు మౌనం వహించడం ప్రమాదకరమన్నారు. జేఏసీ నాయకులు ఎలీషాకుమార్, దస్తగిరి అహ్మద్, కాకు వెంకటయ్య, రియాజ్, ఎస్తానీ, అబ్రహం, రాజశేఖర్ జాషువా, ఆరోన్, ఆనందరావు, ప్రసాదరావు, గఫూర్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

అందరూ ఉన్నా.. అనాథగా జీవనం


నెర్దనంపాడు వద్ద బస్‌షెల్టర్‌లో జీవచ్ఛవంగా పడి ఉన్న వృద్ధుడు ఇండ్ల పెద వెంకయ్య

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని నెర్దనంపాడుకు చెందిన ఇండ్ల పెద వెంకయ్య (83) అనే వృద్ధుడు తన కన్నబిడ్డలు పట్టించుకోకుండా వదిలేయడంతో స్థానికంగా ఉన్న బస్‌షెల్టర్‌లోనే తలదాచుకుంటూ అనాథగా జీవిస్తున్న వైనమిది. తిండి, తిప్పలు, తాగునీరు కూడా లేకపోవడంతో నరక యాతన అనుభవిస్తూ ఆయన పడుతున్న యాతన చూపరులకు ఆవేదన కలిగిస్తోంది. తమ కన్నబిడ్డలు తమకేమి సంబంధం లేదన్నట్లు వదిలేయడంతో అటుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు తమకు తోచిన ఆహారం అందజేసి అనాథగా ఉన్న ఆ వృద్ధుడిపై కనికరం చూపిస్తున్నారు. వృద్ధాప్యంలో తోడు, నీడగా ఉండాల్సిన కుమారులు కన్న తండ్రి అని కూడా చూపిస్తున్న నిర్దయ స్థానికులకు తీవ్ర మనస్థాపం కలిగిస్తోంది. పిడికెడు మెతుకులు తప్ప ఏమి ఆశించని ఆ వృద్ధుడు మూడు రోజులుగా బస్‌షెల్టర్‌లోనే అనాథగా పడి ఉండడం బాధాకరమని వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులైనా చొరవ చూపి ఆ వృద్ధుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీఎల్‌ఓలు బాధ్యతతో పరిశీలించాలి

- ఆర్డీఓ సాధు కరుణకుమారి
- బీఎల్‌ఓలు, రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం


మాట్లాడుతున్న ఆర్డీఓ సాధు కరుణకుమారి

ఆత్మకూరు: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలకు కేటాయించిన ప్రాంతంలో ఓటర్ల జాబితాల పరిశీలన బాధ్యతగా నిర్వహించాలని, వారి వెంట రాజకీయ పార్టీల నాయకులను తీసుకెళ్లాలని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారం బీఎల్‌ఓలు, సచివాలయ సిబ్బంది, పలు రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు వారికి కేటాయించిన ప్రాంతంలో వృద్ధుల వివరాలను, పూర్తిగా గ్రామం విడిచి వెళ్లిన వారిని గుర్తించి వారి పేరు తొలగించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ సుభద్ర, వైఎస్సార్‌సీపీ నేతలు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, బీఎస్పీ నాయకుడు నందా ఓబులేసు, టీడీపీ నాయకుడు టి చంద్రారెడ్డితోపాటు పలు పార్టీల నాయకులు, వివిధ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ఆత్మకూరు న్యాయవాది


మందల లిఖిత

ఆత్మకూరు: రాష్ట్ర హైకోర్టు ఇటీవల నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్ష ఫలితాల్లో ఆత్మకూరుకు చెందిన న్యాయవాది మందల లిఖిత జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. ఆత్మకూరు బార్ అసోసియేషన్‌లో మెంబర్‌గా ఉన్న ఈమె పలు కేసుల్లో ప్రతిభ చూపారు. ఈ క్రమంలో జూనియర్ సివిల్ జడ్జి డిపార్ట్‌మెంట్ నిర్వహణ పరీక్షలకు హాజరై ఓపెన్ కేటగిరీలో ఎంపికవ్వడంతో ఆత్మకూరుకు చెందిన న్యాయవాది నందా ఓబులేసు తదితరులు ఆమెను అభినందించారు. ఈమె స్వగ్రామం ఆత్మకూరు మండలం గండ్లవేడు. ఈమె తండ్రి బ్యాంకు ఉద్యోగిగా పని చేస్తుండేవారు.

రెవెన్యూ సదస్సు విజయవంతం చేయండి

చేజర్ల (సోమశిల): రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు 10వ తేదీ ఆత్మకూరులో నిర్వహించే రెవెన్యూ సదస్సును విజయవంతం చేయాలని అనంతసాగరం మండలం జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ అక్కలరెడ్డి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు మండలంలోని కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, రైతులు పాల్గొనాలని కోరారు. మండలంలోని చుక్కల భూములకు మంత్రి పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

షాదీ తోఫా ముస్లింలకు వరం

ఉదయగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీల సంక్షేమంలో భాగంగా ప్రవేశ పెట్టిన వైఎస్సార్ షాదీ తోఫా పథకం వరమని, ఆ పథకం ద్వారా ముస్లిం కుటుంబాల్లో ఆనందోత్సహాలు వెల్లివిరుస్తున్నాయని జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ గడియాల్చి ఎస్తానీ, ఉప సర్పంచ్ ముర్తూజాహుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తోఫా పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.లక్ష నేరుగా ఖాతాల్లో జమ చేయడం సంతోషకరమన్నారు. షాదీ తోఫా పథకానికి దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లో లబ్ధి అందుతుందన్నారు. ఏ రాష్ట్రంలో కూడా షాదీ తోఫా పథకం ముస్లింలకు లేదన్నారు.

సమగ్ర ఓటరు జాబితాకు సహకరించండి



ఉదయగిరి: సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు బీఎల్వోలకు సహకరించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జి.సువర్ణమ్మ అన్నారు. ఆమె బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎనిమిది మండలాల తహసీల్దార్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎల్‌ఓలు ఇంటింటికి తిరిగి ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులకు సంబంధించిన విషయాలను సేకరిస్తారన్నారు. తహసీల్దార్లు సర్వేను పరిశీలిస్తుండాలన్నారు. సర్వే పారదర్శకంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి జగదీష్‌బాబు పాల్గొన్నారు.

ప్రాజెక్ట్‌లపై టీడీపీ అసత్య ప్రచారాలు


గడప గడపకు మన ప్రభుత్వంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- జగనన్న ప్రభుత్వంలో శరవేగంగా ప్రాజెక్ట్‌ల పూర్తి
- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యత మేరకు పూర్తి చేసుకుంటూ వస్తున్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు తమ హయాంలో ప్రాజెక్ట్‌ల అభివృద్ధిని పూర్తి స్థాయిలో విస్మరించి ఇప్పుడు వాటిపై విమర్శలు చేయడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. ఎవరి హయాంలో ప్రాజెక్ట్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయో.. శరవేగంగా జరుగుతున్నాయో ప్రజలకు తెలుసు అన్నారు. బుధవారం సంగం మండలం జెండాదిబ్బలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందచేసి వారి సమస్యలు అడిగి తెలసుకున్నారు. స్థానికంగా రోడ్లు, డ్రైనేజీల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి రాగా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ల నిర్మాణాలపై అసత్య ప్రచారాలు చేస్తూ పర్యటిస్తున్నారని, తమ ప్రభుత్వ హయాంలో 2014 నుంచి 2019 వరకు ప్రాజెక్ట్‌ల నిర్మాణాలపై తీసుకున్న చర్యలను కూడా ప్రజలకు వివరించాలన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రధానమైన ఎంజీఆర్ సంగం బ్యారేజీ, హైలెవల్ కెనాల్ నిర్మాణాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంగం బ్యారేజీ నిర్మాణం పూర్తి చేసి రైతులకు అంకితం చేశారన్నరు. హైలెవల్ కెనాల్ నిర్మాణానికి గతంలో తమ తండ్రి మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకొచ్చి మేనిఫెస్టోలో ప్రకటించారన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం, హైలెవల్ కెనాల్ నిర్మాణాలు పూర్తయితే ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలు సస్యశ్యామలవుతాయన్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ ఇప్పటికే పూర్తి కావచ్చిందని, ఇది మరో సంవత్సరంలో అందుబాటులోకి వస్తుందన్నారు. హైలెవల్ కెనాల్ నిర్మాణ విషయంలో అధికారులతో మాట్లాడితే నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ఇంకా జరగలేదని, రెవెన్యూ సమస్యలు ఉన్నాయని, ఇవ్వన్ని పూర్తి చేస్తే తమకు అందిస్తే నిర్మాణం చేపడుతామని అంటున్నారని, మూడు సంవత్సరాల్లో హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్ట్‌లన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిచేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష పార్టీలు ప్రాజెక్ట్‌లకు చేసిన ఖర్చుల వివరాలను, తీసుకున్న నిర్ణయాలను ప్రజలకు వివరిస్తే బాగుంటుందన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

అనంతరం జెండాదిబ్బలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రావుల లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎం.దేవసహాయం, మండల కన్వీనర్ పులగం శంకర్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కంటాబత్తిన రఘునాథరెడ్డి, మెట్టుకూరు వాసుదేవరెడ్డి, జేసీఎస్ కో ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, ఉపసర్పంచ్ గుర్రం నరేష్ గుప్తా, కో ఆప్షన్ సభ్యులు మన్సూర్, బాబు, చిన్న, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు కోటంరెడ్డి బాలకృష్ణారెడ్డి, మానికల చందన్‌కుమార్, ఆనం ప్రసాద్‌రెడ్డి, నేతలు గుండాల బాలచంద్రారెడ్డి, శేఖరయ్య, ఫణికుమార్‌రెడ్డి, కరిముల్లా, తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ గోపి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

జెండాదిబ్బ గ్రామానికి చెందిన షేక్ రహమత్ తన భర్త కరిముల్లా పక్షవాతంతో మంచానపడడంతో కుటుంబ జీవనాధారం కష్టమైందని ఎమ్మెల్యేకు విన్నవించడంతో ఆయన తన సొంత నిధులు రూ.25 వేలను ఆ కుటుంబానికి అందజేశారు. జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి పింఛను మంజూరు చేయించాలని సూచించారు.

మేరీమాటీ, మేరాదేశ్ కార్యక్రమం


జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

ఉదయగిరి: పట్టణంలోని మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మేరీమాటీ, మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ పి.సుబ్బలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించుకోవాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. అధ్యాపకులు నరసింహులు, డి.వెంకటసుబ్బయ్య, విక్రం పాల్గొన్నారు.

మేరీమాటీ మేరా దేశ్ ర్యాలీ

చేజర్ల(సోమశిల): ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా అనంతసాగరం మండలంలోని చిలకలమర్రిలో బుధవారం హైస్కూల్ సిబ్బంది, విద్యార్థులు మేరీ మాటీ, మేరా దేశ్ ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మేరీ మాటీ మేరీ దేశ్ కార్యక్రమం దేశ వ్యాప్తంగా నిర్వహించుకుంటున్నారన్నారు. జాతీయ జెండాలు, దేశ నాయకుల చిత్ర పటాలు చేతబూని భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ రమణ, మదీనా, మహేష్, వెంకటేశ్వర్లురెడ్డి, రమణరాజు, కృష్ణారెడ్డి, మాధవి పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి

ఆత్మకూరురూరల్: ఎందరో అమరుల త్యాగాలతో స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిందని, దేశభక్తిపై చిన్నారులతో పాటు నేటితరం ప్రేరణ పొందాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మన భూమి, మన దేశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని నువ్వూరుపాడులో బుధవారం పాఠశాల విద్యార్థులు, స్థానికులతో కలిసి దేశభక్తి నినాదాలు చేస్తూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మీ దేశభక్తి ప్రతిజ్ఞ చేయించారు.

దేశనాయకులకు నివాళులు

వరికుంటపాడు: మేరీమాటీ–మేరీదేశ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తూర్పుబోయమడుగుల ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ విజయభాస్కరరావు, సర్పంచ్ చల్లకొలుసు నాగరాజులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించారు. శిలాఫలకం ఆవిష్కరించారు. మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు.